క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి



దామెర : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని హౌసింగ్ పీడీ హరికిషన్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని అధికారులకు, పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీడీ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కల్పన, ఎంపీఓ రంగాచారి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



ఐనవోలు : బహుళ త్రయోదశిని పురస్కరించుకుని మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం ప్రదోషకాలంలో నందీశ్వరుడికి అభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో రుద్రుడికి అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసిన అర్చకులు.. సాయంకాలం సూర్యాస్తమయం తర్వాత ప్రదోష కాలంలో మల్లికార్జునస్వామి గర్భాలయానికి ఎదురుగా ప్రతిష్ఠితమైన నందీశ్వరుడికి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకించారు. నందీశ్వరుడికి వస్త్రదారణ చేసి, ధూపం వేసి గంధం బొట్టుపెట్టి అలంకరించారు. వేదోక్తంగా పూజించి ఫలాలతో నైవేద్యం సమర్పించారు. శనిగల ప్రసాదం నందీశ్వరుడి ముఖానికి కట్టి, వడమాలను మెడలో వేసి సమర్పించారు. అనంతరం ఏక కాలంలో నందీశ్వరుడికి, గర్భాలయంలో రుద్రుడికి నక్షత్ర హారతి సమర్పణ కనులపండువగా జరిపించారు. ఈఓ సుధాకర్, ముఖ్య అర్చకులు మధుకర్‌శర్మ, వేద పండితులు పురుషోత్తమశర్మ, అర్చకులు భానుప్రసాద్, మధు, నరేశ్ శర్మ, సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్ భక్తులు పాల్గొన్నారు.

గుడి స్థలంపై ప్రకటన సిగ్గుచేటు



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు

పరకాల : పట్టణంలోని పశువుల సంత స్థలం శ్రీకుంకుమేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించినట్లు కోర్టు ఇచ్చిన తీర్పు విజయం వెనుక మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పాత్ర ఏ మాత్రం లేదని దేవస్థానం చైర్మన్ కొలుగూరి రాజేశ్వర్‌రావు స్పష్టం చేశారు. గుడి స్థలంపై ఆయన చేసిన ప్రకటన సిగ్గుచేటని ఆరోపించారు. శనివారం దేవస్థానం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పరకాల పశువుల సంత స్థలంపై 1984 నుంచి వివాదం నడుస్తుందన్నారు. ఆ భూమి దేవస్థానానికి సంబంధించినట్లుగా కోర్టు ముందు ఆధారాలు పెట్టడానికి గతంలో తాను చైర్మన్‌గా పనిచేసిన సమయంలో ఎంతగానో శ్రమించినట్లు తెలిపారు. తనతో పాటు ధర్మకర్తల మండలి, రెవెన్యూ అధికారుల సహకారంతో భూ రికార్డులను సేకరించడం, గవర్నమెంట్ ప్లీడర్‌లకు అందించడం ద్వారా కేసు నెగ్గేందుకు బలం చేకూరిందన్నారు. పశువుల సంత ద్వారా పరకాల మున్సిపాలిటీకి ఏడాదికి రూ.5లక్షల ఆదాయం రావడంలో తమ కృషి ఉందన్నారు. అయితే హైకోర్టు ఆదేశాల మేరకు పశువుల సంత స్థలం దేవస్థానానికి సంబంధించినట్లు రెవెన్యూ అధికారులు తేల్చడంపై మాజీ చైర్మన్ గందె వెంకటేశ్వర్లు గొప్పలు చెప్పుకోవడం హాస్యస్పదంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో ఆలయ ఈఓ వెంకటయ్య, ప్రధాన అర్చకుడు నాగభూషణంశర్మ, ధర్మకర్తలు రవి, నవీన్, ప్రజాపత్ శ్యామల రాము, సంధ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



మధుకర్ (ఫైల్)

ఎల్కతుర్తి : ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు గడ్డిమందు తాగి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లికి చెందిన రేణికుంట్ల మధుకర్(36) ఆర్థిక, అనారోగ్య సమస్యలతో మానసికంగా కృంగిపోయినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 5న గడ్డిమందు తాగినట్లు తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. పరిస్థితి విషమించి మధుకర్ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వసూలు సరే.. వసతులేవి?

- ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి సంత నిర్వహణ
- పార్కింగ్ స్థలం లేక ట్రాఫిక్ ఇక్కట్లు
- కొనుగోలుదారుల ఇబ్బందులు
- గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు



మండల కేంద్రంలో ప్రైవేట్ స్థలంలో నిర్వహిస్తున్న సంత

వేలేరు : మండల కేంద్రంలో ప్రతీ బుధవారం నిర్వహించే వారాంతపు సంతలో సమస్యలు తిష్ట వేశాయి. మండలంలోని 12 గ్రామాలకు ఒకటే సంత ఉండటంతో బుధవారం రద్దీ ఎక్కువగా ఉంటుంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వందల సంఖ్యలో సంతలో కూరగాయలు, సరుకులు కొనుగోలు చేస్తుంటారు. కానీ సంతలో సౌకర్యాలు లేపోవడంతో చిరువ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూరగాయలు, వివిధ రకాల నిత్యవసరాల నిల్వకు స్థలం సరిపోకపోవడంతో రోడ్లపైనే విక్రయిస్తుండటంతో వాహనదారులకు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. సంతకు వచ్చే వాహనాలకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను నిలుపుతుండటంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి..

మండల కేంద్రంలో నిర్వహించే సంత స్థలం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో కొనసాగుతుండడంతో వ్యాపారులకు, ప్రజలకు నష్టాలు కలిగించే విధంగా ఉన్నాయని పులువురు విమర్శిస్తున్నారు. సంత నిర్వహించే స్థలం తమదని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు ప్రతీ దుకాణం నుంచి రూ.30 చొప్పున వసూలు చేస్తూ గ్రామ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నట్లు తెలిసింది. గతంలో కొన్ని రోజుల పాటు సంతలో ఏర్పాటు చేసే దుకాణాదారులు గ్రామ పంచాయతీకే డబ్బులు చెల్లించేవారని, కానీ కొన్నేళ్లుగా ఆ స్థలం తమదని, గ్రామ పంచాయతీకి డబ్బులు చెల్లిస్తే సంత నిర్వహించేందుకు ఒప్పుకోమంటూ చిరు వ్యాపారులను కొందరు హెచ్చరించినట్లు సమాచారం. ప్రతీ దుకాణాదారుడు తమకే డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేయడంతో చిరువ్యాపారులు చేసేదేంలేక ప్రైవేట్ వ్యక్తులకే డబ్బులు చెల్లిస్తున్నట్లు తెలిసింది. అయితే వ్యాపారుల నుంచి డబ్బులు తీసుకుంటున్న ప్రైవేట్ వ్యక్తులు సంత ప్రదేశంలో మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి గ్రామ పంచాయతీ స్థలంలో వారాంతపు సంత నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, కొనుగోలుదారులు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి



వేలేరులో ప్రతీ బుధవారం కూరగాయల సంతకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వందలాది మంది వచ్చి కూరగాయలు, ఇతర సరకులు కొనుగోలు చేస్తుంటారు. సంతలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో చిరు వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు వ్యక్తుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంతను గ్రామ పంచాయతీ అధికారులు ప్రభుత్వ స్థలంలో నిర్వహించి సౌకర్యాలు కల్పించాలి.

– వేల్పుల రవి, సీపీఎం మండల కార్యదర్శి

బాలల హక్కులను సంరక్షించాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయమూర్తి సాయిశరత్

శాయంపేట : బాలల హక్కులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పరకాల జూనియర్ సివిల్ న్యాయమూర్తి సాయిశరత్ అన్నారు. శనివారం మండలంలోని మాందారిపేట శివారులో గల కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ మాధవి అధ్యక్షతన న్యాయ విభాగంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, సాంకేతిక మోసాలతోనే విద్యార్థులను అక్రమ రవాణాకు టార్గెట్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయస్సులో వివాహాలు చేయవద్దని, ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శాయంపేట సీఐ రంజిత్ రావు, ఎస్సై జక్కుల పరమేశ్, పరకాల లీగల్ సెల్ మెంబర్ రాజమౌళి, అడ్వొకేట్ మేకల శ్రవణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నాం..



హన్మకొండ: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో లో వోల్టేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఈ మేరకు హనుమకొండ నక్కలగుట్టలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు, సదుపాయాలు, అవసరాలపై వినతి పత్రం అందించారు.

పరకాల : బస్సులు లేక నిర్మానుష్యంగా ఆర్టీసీ బస్టాండ్



శాయంపేట : జాతీయ రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న రాజకీయ పార్టీల నాయకులు



ఆత్మకూరు : బంద్‌లో పాల్గొన్న బీజేపీ, ప్రజాసంఘాల నాయకులు



‘బీసీ’ బంద్ సంపూర్ణం

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ పిలుపునిచ్చిన బంద్ శనివారం ప్రశాంతంగా ముగిసింది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. బంద్ నేపథ్యంలో పరకాల ఆర్టీసీ డిపో నుంచి బస్సులు బయకెళ్లకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివిధ వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటిస్తూ ఉదయం నుంచే తెరుచుకోలేదు. కమలాపూర్‌లో బైక్ ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. నడికూడ, ఆత్మకూరు, దామెర, శాయంపేట, వేలేరు, ఐనవోలు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో బంద్ విజయవంతమైనట్లు బీసీ జేఏసీ నాయకులు ప్రకటించారు.

సాక్షి, నెట్‌వర్క్



ఎల్కతుర్తి : బస్టాండ్ వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్



ఐనవోలులో..



కమలాపూర్ : నిరసన తెలుపుతున్న బీసీ సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు



నడికూడలో..



వేలేరులో..



దామెరలో..

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం కొత్తకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 2000–2001 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆటాపాటలతో ఉత్సాహంగా గడిపారు. చదువు చెప్పిన గురువులు తిరుపతయ్య, సోమలింగం, నర్సయ్య, అజయ్, ఎల్లయ్య, చంద్రమౌళి, రమేశ్, మొగిళి తదితర ఉపాధ్యాయులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. మృతి చెందిన ఉపాధ్యాయులను తలచుకుంటూ వారికి నివాళులర్పించారు. అశోక్, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత దీపావళి అందరి బాధ్యత



ఐనవోలు : కాలుష్య రహిత దీపావళి పండుగ జరుపుకోవడం అందరి బాధ్యతని ఏకశిల విద్యా సంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పున్నేలు క్రాస్ వద్ద గల ఏకశిల ఈ–టెక్నో స్కూల్‌లో ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఐనవోలు, వర్ధన్నపేట గ్రామాల్లో టపాసులతో పర్యావరణం కాలుష్యం చేయవద్దని ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. స్థానికులకు మొక్కలు, మట్టి దీపాల ప్రమిదలు అందించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటి దీపాలతో పూజించారు. పూలతో ప్రత్యేకంగా రూపొందించిన అలంకరణలో దీపాల ప్రదర్శన చేశారు. ప్రిన్సిపాల్ బాబా, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐకమత్యంతో ఆలయాన్ని అభివృద్ధి చేయాలి

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు
- శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఈఓ సుధాకర్, పక్కన ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు : దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని, సామాజిక ఐక్యతకు ప్రతీకలని, గ్రామస్తులందరూ సమష్టిగా ఐకమత్యంతో ఆలయాన్ని అభివృద్ధి చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. శనివారం ఐనవోలు మండలం కక్కిరాలపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నూతన ధర్మకర్తల మండలి పదవీ, గోప్యత ప్రమాణస్వీకారం ఈఓ కందుల సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాగరాజు హాజరుకాగా అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఈఓ సుధాకర్ పబ్బతి సత్యనారాయణ, నిమ్మని వేణుగోపాల్‌రావు, కాటబోయిన కుమారస్వామి, రావుల భిక్షపతి, కంజర్ల రజితతో పాటు ఎక్స్అఫిషియోగా అర్చకుడు పరాశరం జయకృష్ణమాచార్యను పదవీ, గోప్యత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్‌గా పబ్బతి సత్యనారాయణను నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చైర్మన్, సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, మహిళా అధ్యక్షురాలు ఇల్లందుల ఎలిషా, ఐనవోలు ఆలయ చైర్మన్ ప్రభాకర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, నాయకులు సంపత్, బుచ్చిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, రవి, సుమన్, మహేందర్, సుధీర్, మధు, జగన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు సక్రమంగా చేపట్టాలి

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీను



ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్డీఓ శ్రీను

కమలాపూర్ : ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులు, అందుకు సంబంధించిన కొలతలు, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. ఏప్రిల్ 1, 2024 నుంచి మార్చి 31, 2025 వరకు మండలంలో చేపట్టిన రూ.8.08 కోట్ల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులకు సంబంధించి కమలాపూర్ రైతు వేదికలో శుక్రవారం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పది రోజులుగా అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం నివేదికలను గ్రామాలు, అంశాల వారిగా చదివి వినిపించారు. అనంతరం డీఆర్డీఓ మాట్లాడుతూ.. ఈజీఎస్ రికార్డుల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులను, ప్రతి పనికి సంబంధించిన వివరాలు నోటీస్ బోర్డులో పెట్టాలని ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామాల్లో చేపట్టిన అన్ని రకాల ప్లాంటేషన్లు, నర్సరీల్లో ఖచ్చితంగా 85 శాతం మొక్కలు బతికి ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గుండె బాబు, అడిషనల్ డీఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డి, డీపీఓ నర్సింహారెడ్డి, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ పుష్పలత, జిల్లా టెక్నికల్ సెల్ ఈసీ శ్రీధర్, సీసీ పున్నంచందర్, ఎస్పార్పీ రంజిత్, డీర్పీలు కల్యాణ్, శంకర్, ఏపీఓ రమేశ్, ఈసీ శ్రీకాంత్, డీఆర్పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కిసాన్ యాప్‌తోనే పత్తి విక్రయాలు

- ఏఓ గంగాజమున



రైతులతో మాట్లాడుతున్న ఏఓ గంగాజమున

శాయంపేట : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్‌తోనే పత్తి విక్రయాలు నిర్వహించాల్సి ఉంటుందని ఏఓ క్యాతం గంగాజమున తెలిపారు. శనివారం మండలంలోని మైలారం, కొత్తగట్టు సింగారం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతుల జాబితాను ప్రదర్శించారు. అనంతరం మైలారం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులతో మాట్లాడారు. పత్తి రైతులు తప్పనిసరిగా తమ పంట వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని, ఇదివరకే నమోదు చేసుకున్న రైతులు తమ వివరాలను సరిగా ఉన్నాయో లేదో అని వ్యసాయ విస్తరణ అధికారుల వద్ద చూసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఓటీపీ ఆధారిత పద్ధతిలో పత్తి విక్రయాలు జరుగుతున్నాయని, రైతులు తమ మొబైల్ నంబర్ సరిగా ఉందో లేదో నిర్ధారించుకోవాలన్నారు. మైలారం ఏఈఓ అన్వేష్, కొత్తగట్టు సింగారం, ఏఈఓ రాకేశ్, రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై సురేశ్

వేలేరు : క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని ఎస్సై అజ్మీర సురేశ్ అన్నారు. మండలంలోని పీచర గ్రామంలో యూత్ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి విజయానికి దారి చూపెడుతుందన్నారు. యువత సోషల్ మీడియాలో కాకుండా క్రీడా మైదానాల్లో ఎక్కువ సమయం గడపాలన్నారు. అలాగే గ్రామానికి చెందిన మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి మొదటి బహుమతిగా రూ.30,116, జంపయ్య 20,116, కొయ్యడ మహేందర్ 10,116 బహుమతులు అందించారు. అలాగే రఘునాయకుల శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందించారు.

రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్, బీజేపీ నాటకం

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



మాట్లాడుతున్న రాజయ్య

వేలేరు : బీసీ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్, బీజేపీ నాటకమాడుతున్నాయని, బీసీలను మోసం చేస్తున్నాయని స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య విమర్శించారు. శనివారం మండలంలోని మల్లికుదుర్ల గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని స్వయంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఇచ్చిన హామీ ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఇచ్చిన స్టేతో బీసీలపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి ఎంటో బట్టబయలైందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మూకుమ్మడిగా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు సోమిరెడ్డి, రవీందర్, ప్రభాకర్, ఎల్లయ్య, యాదగిరి, మహేందర్, హరీఫ్, సంపత్ పాల్గొన్నారు.

మత్స్యపారిశ్రామిక సంఘం సభ్యులపై కేసు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూరు మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు అలుగు సంపత్, కార్యదర్శి నాగరాజు, డైరెక్టర్లు కనుకయ్య, రాంబాబు, పోచయ్య, రవి, మొగిళి, కనుకయ్యపై కేసు నమోదు అయ్యింది. కమలాపూర్‌కు చెందిన బాధితుడు అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. ముల్కనూరు గ్రామంలోని చేపల చెరువును తనకు లీజుకు ఇస్తామని నమ్మించి డబ్బులు తీసుకున్నారని, ఆ తర్వాత చెరువును నారాయణగిరి గ్రామానికి చెందిన సంపత్ అనే వ్యక్తికి మోసపూరితంగా లీజుకిచ్చి తనను ఆర్థికంగా నష్టపరిచారని అశోక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు శనివారం వెల్లడించారు.